సాక్షి
శ్రీకాకుళం
మంగళవారం । 17 । జనవరి । 2023



వాణిజ్య బ్యాంకులకు దీటుగా..

డీసీసీబీ వాణిజ్య బ్యాంకులకు దీటుగా ఎదుగుతోంది. నిర్దేశించిన లక్ష్యాలను సాధిస్తోంది.

- 8లో



కొత్త బెల్లం రెడీ

నాగావళి పరివాహక ప్రాంతంలో బెల్లం రెడీ అవుతోంది. సంక్రాంతి రోజుల్లో బెల్లం తయారవుతుంది.

- 8లో

నేడు పారా మిలటరీ సైనికుల సమావేశం

నరసన్నపేట: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం పారామిలటరీ, కేంద్ర సాయుధ పోలీసు బలగాలకు చెందిన సభ్యుల సమావేశం నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. జిల్లాకు చెందిన బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, ఐటీబీసీ, ఎస్ఎస్‌బీ, అస్సాం రైఫిల్స్‌కు చెందిన జిల్లా సైనికులు సమావేశంలో పాల్గొనాలని కోరారు. ఉదయం 10 గంటల నుంచి కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

న్యూస్‌రీల్

ఉచిత ల్యాబ్ టెక్నీషియన్ శిక్షణ

శ్రీకాకుళం కల్చరల్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ శ్రీకాకుళం జిల్లా శాఖ రక్తనిధి కేంద్రంలో మూడునెలల ఉచిత ల్యాబ్ టెక్నీషియన్ శిక్షణ కోసం దరఖాస్తులు కోరుతున్నట్లు చైర్మన్ పి.జగన్మోహనరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం కనీసం డీఎంఎల్‌టీ పాసై ఉండాలని, శిక్షణ కాలంలో స్టైఫండ్, సర్టిఫికెట్ ఇస్తామని తెలిపారు. దరఖాస్తులు పాలకొండ రోడ్డులో ఉన్న బాపూజీ కళామందిర్‌కు ఎదురుగా, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం పక్కన ఉన్న రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయానికి ఈ నెల 25వ తేదీలోగా పంపాలని కోరారు. మరిన్ని వివరాలకు 08942- 226555, 9247137111 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

ప్రాణం తీసిన క్షణికావేశం



సంతోషి లక్ష్మి (ఫైల్)

హిరమండలం: హిరమండలం మేజర్ పంచాయతీ బ్యారేజీ సెంటర్‌లో సంక్రాంతి సందర్భంగా ఆదివారం భార్యాభర్తల మధ్య జరిగిన చిన్న గొడవ భార్య మృతికి కారణమైంది. ఈ గొడవ వల్ల సంతోషి లక్ష్మి (42) ఇంటిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని పోలీసులు తెలిపారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం హిరమండలం బ్యారేజ్ సెంటర్‌కు చెందిన శ్రీనివాస పట్నాయక్, అతని భార్య సంతోషి లక్ష్మిలు సంక్రాంతి రోజు ఆదివారం భోజనం విషయంలో మాటామాటా పెరిగి వాదులాడుకున్నారు. అతి కాస్తా గొడవగా మారడంతో సంతోషి లక్ష్మి ఇంటిలో బెడ్‌రూమ్‌కు వెళ్లి ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకున్నారు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను కిందకు దించి హిరమండలం పీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి శ్రీకాకుళం రిమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడ ఆమె చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆమెకు చరణ్ అనే కుమారుడు ఉన్నాడు. మృతురాలి తల్లి రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని హెచ్‌సీ జగన్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి తీవ్ర గాయాలు



కాంతమ్మను వైజాగ్ కేజీహెచ్‌కు తరలిస్తున్న దృశ్యం

బూర్జ: మండలంలో గల పాలవలస గ్రామ కూడలి వద్ద రహదారిపై ద్విచక్రవాహనం ఢీకొని వృద్ధురాలు తీవ్రంగా గాయపడింది. స్థానిక పోలీసులు, కుటుంబ సభ్యులు తెలియజేసిన వివరాల ప్రకారం పాలవలస గ్రామానికి చెందిన దాసి రెడ్డి కాంతమ్మ ఆదివారం రాత్రి బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా జెడ్పీ హైస్కూల్ వద్ద పాలకొండ వైపు వెళ్తున్న బైక్ ఆమెను బలంగా ఢీకొట్టింది. కాంతమ్మకు బలమైన దెబ్బలు తగలడంతో అపస్మారక స్థితికి వెళ్లిపోయింది. స్థానికులు ఆమెను గుర్తించి ప్రైవేటు వాహనంలో పాలకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం 108 సాయంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడి నుంచి వైజాగ్ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. ఈమె గ్రామంలో ఒంటరిగా ఉంటున్నారు. మనవడు జగదీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఘనంగా సైనిక దినోత్సవం

కవిటి: మండలంలోని దూగానపుట్టుగ, కొత్తపుట్టుగ గ్రామాల్లో ఆదివారం ఇండియన్ ఆర్మీడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా దూగానపుట్టుగలో సైనికుడి విగ్రహానికి యువకులు ఘనంగా నివాళులు అర్పించారు. కొత్తపుట్టుగలో గత 17 ఏళ్లపాటు భారతసైన్యంలో సేవలందించి ఇటీవల పదవీ విరమణ చేసిన విశ్రాంత ఆర్మీ ఉద్యోగి లక్ష్మీనారాయణను మాతృభూమి రుణం తీర్చుకుందాం సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. వేడుకల్లో భాగంగా భాగంగా లక్ష్మీనారాయణకు ఏపీజీఅండ్‌బీసీ చైర్మన్ నర్తు రామారావు, నర్తు చామంతిల సమక్షంలో దుశ్శాలువతో సత్కరించి జ్ఞాపికల్ని అందించారు. కార్యక్రమంలో నర్తు సోమేశ్వరరావు, నర్తు అశోక్, సప్ప శ్రీనువాసరావు, దేవరాజ్, వాసుదేవ్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కొత్తపుట్టుగలో విశ్రాంత సైనికుడిని సత్కరిస్తున్న దృశ్యం

ఊరికి ఉత్సాహం

సంక్రాంతి సంబరాలను ఊళ్లు ఉత్సాహంగా జరుపుకున్నాయి. పెద్ద పండగ సందర్భంగా జిల్లాలోని పలు పల్లెల్లో జాతరలు, ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ప్రతి ఉత్సవానికి జనం పోటెత్తారు. భోగి నాడు మొదలైన వేడుకలు కనుమ వరకు కన్నుల పండువగా సాగాయి. బంధువులు, చుట్టాల రాకతో గ్రామాలు కళకళలాడాయి.



మల్లన్న కొండపై భక్తులు

● ఉప్పొంగిన మెట్టవలస

మెట్టవలస గ్రామంలోని మల్లికార్జున స్వామి యాత్ర మహోత్సవాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ ఏకశిలా పర్వతం భక్తజనంతో ఉప్పొంగింది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా గ్రామ పెద్దలు ఏర్పాట్లు చేశారు. ఎస్ఐ సామంతుల రామారావు ప్రత్యేక పోలీస్ బందోబస్తు నిర్వహించారు. - జి.సిగడాం

● ఘనంగా అప్పన్నమ్మ తల్లి కనుమ సంబరాలు

పెదపాడు గ్రామంలో వెలసిన అప్పన్నమ్మ తల్లి ఆలయ కనుమ పండుగ సంబరాలు సోమవారం ఘనంగా జరిగాయి. ప్రధాన పురోహితులు చోడిమోడి అప్పలరామయ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానంగా అప్పన్నమ్మతల్లి పుట్టిన సదరు నుంచి మేళ తాళాలు, డప్పు వాయిద్యాలతో, సాము గరిడీతో ఊరేగింపుగా నీలమ్మ గుడి వరకూ కొనసాగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ పెద్ద ఎత్తున భక్తులు పోటెత్తారు. ఏటా కనుమ రోజున ఈ పండుగ ఉత్సవాను గ్రామపెద్దలంతా కలిపి పెద్ద ఎత్తున నిర్వహించడం ఇక్కడ పరిపాటి. ముగ్రాటలు, ఘటాలు, డప్పులు, మేళాలు, తప్పెడుగుళ్ల వాయిద్యాలు అలరించాయి. -శ్రీకాకుళం రూరల్



అప్పన్నమ్మతల్లి



తప్పెడుగుళ్లతో ముగ్రాటలు తీసుకెళ్తున్న దృశ్యం



● పోటెత్తిన భక్తజనం

సంక్రాంతి సందర్భంగా సంగమయ్య కొండ భక్తులతో పోటెత్తింది. ఆది, సోమవారాల్లో కొండ వద్ద జాతర నిర్వహించారు. ప్రాచీనకాలం నాటిదిగా గుర్తింపు పొందిన సంగమయ్య కొండను గోపకొండగా పిలుస్తారు. ఏటా ఇక్కడ జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. జిల్లాలో వివిధ ప్రాంతాలకు చెందినవారు, ఇతర జిల్లాల నుంచి, పక్కన ఉన్న ఒడిశా రాష్ట్రం నుంచి కూడా భారీగా జనం వచ్చి సంగమయ్య కొండను, గుహలో ఉన్న సంగమయ్యను దర్శించుకున్నారు. సంగమయ్య దర్శనం అనంతరం కొండ దిగువ ప్రాంతంలో నిర్వహించే జాతరలో వేలాది సంఖ్యలో జనం పాల్గొన్నారు. జాతర వద్ద నిర్వహించిన ఎగ్జిబిషన్‌లో చిన్నారులు సందడిగా గడిపారు. -ఆమదాలవలస రూరల్

● 12 గ్రామాల మీదుగా ఊరేగింపు

రాజుల కాలం నుంచి ఆనవాయితీగా వస్తున్న రట్టి వల్లభనారాయణుని మందస పయనం సోమవారం వైభవంగా జరిగింది. భేతాళపురం పంచాయతీ రట్టి గ్రామంలోని వల్లభనారాయణస్వామి ఏటా ధనుర్మాసంలోని కనుమ రోజున మందసలోని రాజావారి కోటకు వెళ్తారు. ప్రత్యేక పూజల అనంతరం తిరిగి రట్టి గ్రామానికి తీసుకువస్తారు. సంప్రదాయం ప్రకారం వల్లభ నారాయణ స్వామిని సుమారు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న మందస పట్టణానికి అంబుగాం–బొడ్లూరు, హరిపురం, బాలిగాం, డబారు, ఉమాగిరి మీదుగా కాలినడకన తీసుకువచ్చారు. మందస రాజులకు సంతానం లేకపోవడంతో వల్లభనారాయణుని సముద్ర తీరం ద్వారా ఇతర రాష్ట్రాల నుంచి తీసుకువచ్చి ప్రతిష్ఠించడంతో వారికి సంతాన కలిగిందట. అప్పటి నుంచి ఏటా సంక్రాంతి రోజున స్వామిని మేళ, తాళాలతో ఊరేగింపుగా మందస రాజావారి కోటకు తీసుకువచ్చి పూజలు చేయడం ఆనవాయితీ. మందస వచ్చిన స్వామికి దారి పొడవునా భక్తులు అమృత భాండాలు, పూర్ణకుంభాలతో, పువ్వులు, కుంకుమలతో ఆహ్వానించి, ప్రత్యేక పూజలు జరిపారు. హరిపురంలో స్వామికి మహిళలు నీరాజనం పట్టారు. ఈ సందర్భంగా మహిళలు స్వామివారి ముందు కోలాటం ప్రదర్శించారు. - మందస



హరిపురంలో స్వామిని ఆహ్వానిస్తున్న భక్తులు

● లోలుగులో కోడెబళ్ల సంబరాలు

మండలంలోని లోలుగు గ్రామంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా సోమవారం కోడే బళ్ల సంబరాలు, ముగ్గుల పోటీలు ఆకట్టుకున్నాయి. ఏటా సంక్రాంతికి ఇక్కడ కోడె బళ్ల సంబరాలు జరుగుతాయి. పోటీల్లో గెలుపొందిన వారికి జెడ్పీటీసీ లోలుగు కాంతరావు బహుమతులను అందజేశారు. -పొందూరు



కోడెబళ్లను తోలుతున్న జెడ్పీటీసీ లోలుగు కాంతారావు

'పాట.. మాటే పేరు తెచ్చాయి'



ఆదిత్యుని జ్ఞాపికను సింగర్ మనోకు అందజేస్తున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు

అరసవల్లి: భగవంతుని ఆశీస్సులతోనే దశాబ్దాలుగా సినీ గీతాలను ఆలపించే అవకాశం తనకు దక్కిందని, అలాగే పాటలతో పాటు డబ్బింగ్ మాటలే ఇంతటి ప్రఖ్యాతిని తెచ్చిపెట్టాయని ప్రముఖ సినీ గాయకుడు మనో అన్నారు.

ఆయన ఆదివారం మకర సంక్రాంతి సందర్భంగా అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకల జనుల సృష్టికి, జీవన గమనానికి ఆదిత్యుడే కర్మసాక్షి అని, నిజంగా పెద్ద పండుగ నాడు ఆదిత్యుడిని దర్శించుకోవడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఇప్పటివరకు పలు భాషల్లో సుమారు 25 వేల పాటలను పాడినట్లుగా వివరించారు.

అంతకుముందు ఆయనకు ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావులు ఘనంగా ఆహ్వానించి అంతరాలయ దర్శనం చేయించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

వారికి కనుమ నాడు భోగి



కొసమాలలో కనుమ నాడు భోగి చేసుకున్న దృశ్యం

మెళియాపుట్టి: మండలంలోని కొసమాల గ్రామంలోని దేవాంగుల వీధిలో కనుమరోజునే భోగి చేస్తారు. అది అనాదిగా వస్తున్న ఆచారమని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ ఏడాది కూడా సోమవారం నాడు భోగి నిర్వహించారు. భోగి నాడు చేనేత వస్త్రాల తయారీలో స్థానికులు బిజీగా ఉంటారని, అందుకే కనుమ నాడు భోగి చేసుకోవడాన్ని పూర్వీకులు అలవాటు చేశారని స్థానికులు తెలిపారు.

అలరించిన జానపద కళలు

మెళియాపుట్టి: సంక్రాంతి నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన గిరిజనులు గ్రామీణ కళలు, జానపద నృత్యాలు చేస్తూ అలరించారు.

దీనబంధుపురం గ్రామానికి చెందిన గిరిజన కళాకారులు హరిపురం దండాశి, లోకొండ కృష్ణారావు, జన్ని సోమేష్‌లు మాట్లాడుతూ మన కళలు, సంస్కృతి సంప్రదాయాల గురించి భావి తరాలకు తెలియజేయాల్సి ఉందన్నారు.



మెళియాపుట్టిలో 'మేమే గుర్రాన్ని' ప్రదర్శిస్తున్న గిరిజనులు

రేపు 'రథసప్తమి' ఉత్సవ సమన్వయ కమిటీ సమావేశం



వి.హరిసూర్యప్రకాష్, ఆలయ ఈఓ

అరసవల్లి: ఈ నెల 28వ తేదీ రథ సప్తమి ఉత్సవానికి సంబంధించి ఏర్పాట్లపై కలెక్టర్ అధ్యక్షతన వివిధ శాఖల అధికారుల సమన్వయ కమిటీ సమావేశం ఈ నెల 18వ తేదీ బుధవారం సాయంత్రం 4 గంటలకు ఆలయ అనివెట్టి మండపంలో జరుగుతుందని ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ తెలియజేశారు. ఈ మేరకు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఆదేశాల ప్రకారం నిర్వహిస్తున్న ఈ సమావేశంలో అరసవల్లిలో సప్తమి ఏర్పాట్లు, సూచనలపై తొలి దశగా సమీక్షించనున్నారని వివరించారు. ఈ సమన్వయ కమిటీ సమావేశంలో రెవెన్యూ, పోలీస్, విద్యుత్, మున్సిపల్, ఫైర్, వైద్యారోగ్య శాఖ తదితర శాఖల అధికారులు పాల్గొననున్నట్లు తెలిపారు. భక్తులకు గతంలో కంటే మెరుగైన సౌకర్యాలతో సజావుగా దర్శనాలకు ఏర్పాట్లు ప్రస్తుతానికి జరుగుతున్నాయని ఈఓ వివరించారు.

జోరుగా కొనుగోలు.. చురుగ్గా చెల్లింపు

- ఎప్పటికప్పుడు రైతులకు ధాన్యం డబ్బులు విడుదల
- నిర్ణీత గడువు కంటే ముందు బ్యాంకు ఖాతాలో నగదు
- ఇప్పటికే రూ.532 కోట్లు చెల్లింపు



నగదు వేగంగా వస్తోంది..

రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం నగదు, రవాణా చార్జీలను ప్రభుత్వం నిర్ణీత గడువులోపే వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోంది. దీంతో రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం పంపించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. తాజాగా సంక్రాంతి ముందు రోజు కూడా రైతులకు నగదు విడుదల చేశారు.

– పి.జయంతి, జిల్లా మేనేజర్, సివిల్ సప్లై కార్పొరేషన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఖరీఫ్‌లో ఈ ఏడాది ధాన్యం పండించిన రైతులకు పండగ వాతావరణం కనిపిస్తోంది. మద్దతు ధర చెల్లించడంతో పాటు రైతుకు రవాణా ఖర్చులు సైతం వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాలో జమ చేయడంతో వారి ఈ ఏడాది పండగ ఆనందంతో జరిగింది. ఈ ఏడాది రైతులకు ఎప్పటికప్పుడు వారి ధాన్యం ధరను చెల్లించడంతో వారు సంతోషంగా ఉన్నారు. జిల్లాలో 613 రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుల నుంచి ధాన్యం సేకరించి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొంటున్నారు. ఈ క్రాప్ ఆధారంగా ఈ ఏడాది ధాన్యం సేకరణ సులభమైంది. మద్దతు ధర కూడా బాగుండడంతో రైతులు వారి పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రానికి తరలించడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ఈ ఏడాది బ్యాంకు గ్యారెంటీ కూడా ముందుగా తీసుకోవడం, కొనుగోలులో మిల్లర్ల ప్రభావం లేకుండా జాగ్రత్త పడడంతో రైతులకు మేలు జరుగుతోంది. మిల్లుల కేటాయింపు కూడా పారదర్శకంగా జరగడం, రవాణా చార్జీలు నేరుగా రైతుకే చెల్లించడంతో ఈ ఏడాది ధాన్యం కొనుగోలు సజావుగా, వేగవంతంగా సాగుతోంది. ఈ ఏడాది ఖరీఫ్‌లో జిల్లాలో గల 30 మండలాల్లో 1,53,060 హెక్టార్లలో వరి సాగైంది. అయితే సుమారుగా 8.11 లక్షల మెట్రిక్ టన్నులు వరి ధాన్యం దిగుబడి వస్తోంది. దీనిలో రైతుల అవసరాలు, ఇతర అవసరాలకు మినహాయించగా ప్రభుత్వం 4.30 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసేందుకు లక్ష్యంగా తీసుకున్నారు. మార్చి నెలాఖరు వరకు ఈ మొత్తాన్ని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే ఇప్పటికే జిల్లాలో 3.16 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. గతంతో పోల్చితే ఈ ఏడాది కొనుగోలు జోరుగా సాగుతోంది.

ఈ ఏడాది లక్ష్యాలను మించి ధాన్యం సేకరణకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. కొనుగోలు చేసిన ధాన్యంకు నగదు, రవాణా చార్జీల కొనుగోలు నాటి నుంచి 21 రోజుల్లో చెల్లించేందుకు ప్రభుత్వం రైతులకు భరోసా ఇచ్చింది. అయితే ప్రస్తుతం వారం, నుంచి పది రోజుల్లోగానే రైతుల ధాన్యం సొమ్ము, రవాణా చార్జీలు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు.

జిల్లాలో ఇప్పటివరకు సుమారుగా 69,348 మంది రైతులకు గాను దఫదఫాలుగా రూ. 532 కోట్లు చెల్లించారు. సంక్రాంతి ముందు రోజున జిల్లాలో రైతులకు రూ.324 కోట్లు విడుదల చేశారు. దీంతో రైతుల కళ్లలో సంక్రాంతి కాంతి కనిపించింది.

డేటా తయారీ పదిలం

- పకడ్బందీగా పదో తరగతి విద్యార్థుల డేటా తయారీ
- తప్పులు, దోషాలు లేకుండా నామినల్ రోల్స్
- ఎన్ఆర్‌లలో సవరణకు ప్రభుత్వం చర్యలు
- ఈ నెల 20వ తేదీ వరకు దోషాలు, తప్పుల సవరణకు అవకాశం



శ్రీకాకుళంలోని ఓ పాఠశాలలో సిస్టమ్‌లో విద్యార్థుల డేటాను సరిచూస్తున్న దృశ్యం



పరీక్షలకు సన్నద్ధమవుతున్న పదో తరగతి విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ: పదో తరగతి విద్యార్థుల డేటా తయారీని పకడ్బందీగా చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇప్పటికే విద్యార్థుల పరీక్ష ఫీజుల చెల్లింపుల పర్వం దాదాపుగా పూర్తయ్యింది. జిల్లాలో 589 ఉన్నత పాఠశాలల్లో 30214 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. ఇందులో ప్రభుత్వ బడుల నుంచి 22979 మంది, ప్రైవేటు స్కూల్స్ నుంచి 7,235 మంది విద్యార్థులు ఉన్నారు.

పక్కాగా, పారదర్శకంగా ఉండేందుకు..

ఏప్రిల్ 3వ తేదీ నుంచి మొదలుకానున్న టెన్త్ పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల డేటాతోపాటు వారి వ్యక్తిగత సమాచారం పక్కాగా ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. అయితే భవిష్యత్‌లో విద్యార్థుల మార్క్స్ మెమోలో తలెత్తే తప్పులకు సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులే బాధ్యులని అధికారులు పేర్కొంటున్నారు. అందుకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని పాఠశాల విద్యాధికారులు హెచ్చరిస్తున్నారు.

నామినల్స్ సవరణకు అవకాశం

పదో తరగతి విద్యార్థుల నామినల్ రోల్స్ సవరణకు ప్రభుత్వం సన్నద్ధమైంది. దీంతో విద్యార్థుల వ్యక్తిగత సమాచారం ముఖ్యంగా విద్యార్థి పేరు, తల్లిదండ్రుల పేర్లు, జన్మదినం, మీడియం, వారి ఫొటో, సంతకం, ఆధార్ కార్డు నంబర్, పుట్టుమచ్చలు, మొదటి, ద్వితీయ భాష, తదితర సమాచారం పక్కాగా ఉండేలా చూడాలని పాఠశాల విద్య కమిషనర్ ఆదేశించారు. దీంతో ఒకవేళ పొరపాటున కంప్యూటర్‌లో డేటానమోదు సమయంలో తలెత్తిన దోషాలు, తప్పుల సవరణకు ఈనెల 11 నుంచి 20వ తేదీ వరకు ప్రభుత్వం అవకాశం ఇచ్చింది.

ఇందుకు పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయుల లాగిన్‌లో 'ఎడిట్' ఆప్షన్‌ను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. అయితే పీహెచ్‌సీ విద్యార్థుల సర్టిఫికెట్ అప్‌లోడ్ చేసిన కాపీని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సంబంధిత సెక్షన్‌లో ఒరిజినల్, జిరాక్స్ కాపీలను ఈ నెల 25వ తేదీలోగా తీసుకువచ్చి ధ్రువీకరించుకుని వెళ్లాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

ఒకటికి రెండుసార్లు సరిచూసుకోవాలి



జిల్లాలోని పదో తరగతి విద్యార్థుల నామినల్ రోల్స్‌లో తప్పులు, దోషాలు ఉంటే వాటిని సరిచేసేందుకు ప్రభుత్వం ఎడిట్ ఆప్షన్‌ను ఇచ్చింది. ఈనెల 20వ తేదీ వరకు ఈ అవకాశం ఉంది. హెచ్‌ఎంల లాగిన్‌లో ఎడిట్ చేసుకోవచ్చు. భవిష్యత్‌లో విద్యార్థుల డేటాలో ఉండే తప్పులకు హెచ్‌ఎంలే బాధ్యులవుతారు. ఒకటికి రెండు సార్లు విద్యార్థుల డేటాను సరిచూసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

– గార పగడాలమ్మ, డీఈఓ, శ్రీకాకుళం

క్లుప్తంగా

ఆదిత్యుని సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ అనుపమ చక్రవర్తికి జ్ఞాపికను అందజేస్తున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, శంకరశర్మలు

అరసవల్లి: అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామిని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.అనుపమ చక్రవర్తి కుటుంబసమేతంగా ఆదివారం ఉదయం దర్శించుకున్నారు. వీరికి ఆలయ సంప్రదాయం ప్రకారం ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావులు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. గోత్రనామాలతో ప్రత్యేక పూజలు చేయించి, ఆలయ విశిష్టతను వివరించారు.

ఆదిత్యుడిని దర్శించుకున్న ఏసీబీ జాయింట్ డైరెక్టర్



ఆదిత్యుని జ్ఞాపికను ఏసీబీ జేడీకి అందజేస్తున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు

అరసవల్లి: అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామిని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ జె.రామ్మోహనరావు కుటుంబసమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వీరికి ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావులు ఆలయ సంప్రదాయం ప్రకారం గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనాన్ని చేయించారు. గోత్రనామాలతో ప్రత్యేక పూజలు చేయించారు. ఆరోగ్యం కోసం సూర్య నమస్కారాల పూజలతో పాటు రథసప్తమి వంటి పర్వదినాల విశిష్టతను శంకరశర్మ ఆయనకు వివరించారు. ఈయన వెంట స్థానిక ఏసీబీ విభాగ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జూదం శిబిరంపై దాడి: రూ.లక్ష స్వాధీనం

పోలాకి: మండలంలోని బెలమర జంక్షన్‌లో జూదం జరుగుతున్న స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఇందులో రూ.లక్ష నగదును స్వాధీనం చేసుకుని, పలువురు జూదగాళ్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నర్సింహమూర్తి తెలిపారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	54,930-00
బంగారం(22సి. 10గ్రా.)	50,350-00
వెండి (కిలో)	74,500-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 551.00
శ్రీకాకుళం	రూ. 551.00

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹130	₹215	₹ 235

వాణిజ్య బ్యాంకులకు దీటుగా..



- రైతులకు రుణాలు అందించడంలో ముందంజ
- గత ఏడాది డిసెంబరు వరకూ రూ.2వేల కోట్ల లావాదేవీలు
- మార్చి నాటికి రూ.2,500 కోట్ల లావాదేవీలు లక్ష్యం

శ్రీకాకుళం అర్బన్:

జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(డీసీసీబీ) వాణిజ్య బ్యాంకులకు దీటుగా ఎదుగుతోంది. రైతులు, ఖాతాదారులకు అధునాతన సేవలు అందిస్తూ దూసుకుపోతోంది. సాంకేతిక పరమైన సొబగులను అందిపుచ్చుకుని అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోంది. జిల్లాలో వ్యవసాయ, పాడి రైతులు, చిన్న వ్యాపారులకు ముద్ర రుణాలు గతంలో కంటే ఎక్కువగా రుణాలు అందించింది. జిల్లాలో డీసీసీబీ 25 బ్రాంచిలు, 49 సహకార సంఘాల ద్వారా 2,63,878 మంది ఖాతాదారులకు విస్తృతంగా సేవలు అందిస్తోంది. కరోనా వంటి విపత్కర పరిస్థితులను తట్టుకుంటూ వాణిజ్య బ్యాంక్‌లతో పోటీగా డీసీసీబీ సేవలను అందించింది. గతంలో ఎన్నడూ లేని విధంగా గత ఏడాది డిసెంబరు నాటికే రూ.2వేల కోట్ల లావాదేవీలను నిర్వహించి అగ్రగామిగా నిలిచింది. మార్చినెలాఖరు నాటికి రూ.2,500 కోట్ల లావాదేవీలు లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని వాణిజ్య బ్యాంక్‌ల తరహాలో రైతులకు, ప్రజలకు మరిన్ని సేవలను అందించేందుకు సిద్ధమైంది. ఖాతాదారులకు మొబైల్ బ్యాంకింగ్ సేవలను కూడా అందిస్తోంది. రైతులకు తక్కువ వడ్డీతో అత్యధికంగా రుణాలు అందించడంలో ముందుంది. నెఫ్ట్, ఆర్‌టీజీఎస్ తదితర లావాదేవీలతో పాటు రుణాలు పొందడం, వాయిదాల చెల్లింపులను ఇంటి నుంచే నిర్వహించే వెసులుబాటు కల్పిస్తోంది. పొదుపు మహిళా సంఘాలతో పాటు ఖాతాదారులు, సిబ్బంది కూడా బ్యాంక్ సేవలపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

కౌలు రైతులకు రుణ సదుపాయం

2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను రూ. 2,500 కోట్ల లావాదేవీలు లక్ష్యంగా సేవలందిస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో డిసెంబరు నాటికి రూ.2వేల కోట్ల లావాదేవీలు జరిపింది. జిల్లాలో 25 బ్రాంచిలు, 49 సహకార సంఘాల ద్వారా దీర్ఘ, స్వల్పకాలిక రుణాలు అందించింది. ఇప్పటివరకు 2,01,060 మంది రైతులకు రూ.97826.44 కోట్ల స్వల్ప కాలిక రుణాలు, 3,363 మందికి రూ.6235.40 కోట్ల దీర్ఘకాలిక రుణాలు మంజూరు చేసింది. ఎన్నడూ లేని విధంగా 43 మంది కౌలు రైతులకు కూడా డీసీసీబీ పెద్దపీట వేసింది. ఈ ఏడాది 43 మంది కౌలు రైతులకు రూ.29.90 లక్షలు రుణాలు మంజూరు చేసింది. రైతులకు కావాల్సిన సాంకేతిక పరిజ్ఞానం కలిగిన యంత్రాలు కూడా అందజేస్తున్నాం. ప్రభుత్వ పథకాలైన జగనన్న తోడు, మహిళలకు 9శాతం వడ్డీతో రుణాలు, చిల్లర వ్యాపారులకు కూడా అతి తక్కువ వడ్డీతో రుణాలు ఇస్తున్నాం. నిరుద్యోగులకు కూడా ప్రధానమంత్రి సడక్‌యోజన కింద లోన్‌లు మంజూరు చేయడం జరుగుతోంది. ఖాతాదారులకు బ్రాంచి మేనేజర్ స్థాయిలో అయితే రూ.3లక్షలు, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ స్థాయిలో అయితే రూ.5లక్షలు, జనరల్ మేనేజర్ స్థాయిలో అయితే రూ.7–8లక్షలు ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) స్థాయిలో అయితే రూ.10 లక్షలు వరకూ మంజూరు చేస్తున్నారు. రూ.10లక్షలకు పైబడి అయితే డీసీసీబీ చైర్మన్ స్థాయిలో మంజూరు చేస్తున్నారు.

రుణాల మంజూరు సులభతరం



డీసీసీబీ బ్యాంక్ ద్వారా రైతులకు రుణాలు అందించే ప్రక్రియను సులభతరం చేశాం. గతంలో మాదిరిగా రుణాల కోసం పడిగాపులు కాసే పరిస్థితి లేదు. అర్హత ఉన్న ప్రతి ఒక్క రైతుకూ త్వరితగతిన రుణాలు అందించడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నాం. జిల్లాలోనే నంబర్ వన్ బ్యాంక్‌గా తీర్చిదిద్దేందుకు బ్యాంక్ ఉద్యోగులు, సహకార సంఘ ఉద్యోగులు, యాజమాన్యం కృషిచేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 13 బ్యాంక్‌లలో తొలి మూడు ర్యాంక్‌లలో నిలిచేందుకు కృషి చేస్తున్నాం.

– డి.వరప్రసాదరావు, డీసీసీబీ సీఈఓ

తక్కువ వడ్డీకే రుణాలు మంజూరు



అన్ని బ్యాంక్‌ల కంటే తక్కువ వడ్డీకే రుణాలు మంజూరు చేస్తున్నాం. గతంలో కంటే ఇప్పుడు బిజినెస్ బాగా అవుతోంది. గోల్డ్‌లోన్‌లు కూడా రూ.300కోట్లకు చేరాయి. ఎడ్యుకేషన్ లోన్‌లు ఇవ్వడం జరుగుతోంది. రైతులకు సంబంధించి రుణాలు, హౌసింగ్ లోన్‌లను కూడా ఇస్తున్నాం. రూ.లక్ష లోపు అయితే జీరో వడ్డీతో రుణాలు ఇస్తున్నాం. డిపాజిట్‌లపై కూడా అధిక వడ్డీ ఇస్తున్నాం. జిల్లాలో అన్ని బ్యాంక్‌లను డిజిటలైజేషన్ చేశాం. జగనన్న అధికారం చేపట్టిన తర్వాత సహకార సంఘ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించారు.

– కరిమి రాజేశ్వరరావు, డీసీసీబీ చైర్మన్

పొగ మంచు.. పగ మంచు



దట్టంగా కురుస్తున్న పొగమంచు

మండలంలోని పలు గ్రామాల్లో పొగ మంచు దట్టంగా కురుస్తోంది. గత రెండు రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు తగ్గిపోవటంతో పొగమంచు అధికంగా కురుస్తోంది. రాత్రి చలిగాలుల తీవ్రత పెరిగిపోవటంతో పాటు ఉదయం 8గంటల వరకు పొగ మంచు కురవటంతో ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. పొగమంచు కారణంగా ఇప్పుడిప్పుడే పూతకు వస్తున్న జీడి, మామిడి తోటలకు అపార నష్టం కలుగుతుందని తోటల యజమానులు చెబుతున్నారు. అపరాల పంటలకు కూడా నష్టం జరుగుతుందని రైతులంటున్నారు.

– ఎల్.ఎన్.పేట

వంశధారలో మునిగి యువకుడి మృతి



యర్రా పురుషోత్తం మృతదేహం

భామిని: పెద్ద పండగను చూడడానికి వచ్చిన ఉద్దానం యువకుడు ఆదివారం వంశధార నదిలో మునిగిపోయి అసువులు బాశాడు. వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా కవిటి మండలం కొత్తపుట్టుగకు చెందిన యర్రా పురుషోత్తం(26) హైదరాబాద్‌లోని చర్లపల్లిలో ప్రైవేట్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. పురుషోత్తంతో పాటు అదే ఫ్యాక్టరీలో పనిచేస్తున్న భామిని మండలంలోని బాలేరు–సొలికిరికి చెందిన మరో ఐదుగురు యువకులతో కలిసి పండగ కోసం బాలేరు వచ్చిన పురుషోత్తం మిత్రులతో కలిసి వంశధార నదిలో స్నానానికి దిగి మునిగిపోయి మృతిచెందాడు. మృతుడి మిత్రుల ఫిర్యాదు మేరకు బత్తిలి ఎస్సై అమ్మన్‌రావు, వీఆర్‌ఓ గెల్లంకి వెంకటరమణలు ప్రమాద స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం తరలించారు. ఎంపీటీసీ కొత్తకోట చంద్రశేఖర్ మృతుని కుటుంబానికి సమాచారం తెలియజేసి గ్రామానికి రప్పించారు.

మళ్లీ నాటి రోజుల్లోకి..



ఆత్మీయ కలయిక నిర్వహించిన 2003 బ్యాచ్ విద్యార్థులు

నందిగాం: నందిగాం ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు స్థానిక ఉన్నత పాఠశాలలో ఆదివారం అపూర్వ కలయిక నిర్వహించారు. 1992లో పదో తరగతి చదువుకున్న వారంతా కలిసి పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తమ క్లాస్‌మేట్ అయిన సనపల అప్పలస్వామి నరాల సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడని తెలిసి అందరూ వెళ్లి ధైర్యం చెప్పారు. సోమవారం 1998–2003 బ్యాచ్, అలాగే 2004– 2005 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు కూడా కలిశారు. 1998–2003 బ్యాచ్ విద్యార్థులు అప్పటి తమ ఉపాధ్యాయులైన ఢిల్లేశ్వరరావు, కళ్యాణి, సుహాసిని, కృష్ణారావు, అచ్యుతరావు, హరిబాబులను సత్కరించారు.



తోటూరు తీరంలో పర్యాటకుల సందడి

సంతోషాల తీరం



పుక్కళ్లపాలెం సముద్ర తీరంలో సందర్శకుల విన్యాసాలు

కవిటి: మండలంలోని పుక్కళ్లపాలెం సముద్ర తీరం సోమవారం సందర్శకుల తాకిడితో కిటకిటలాడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు తీరంలో రోజంతా తమ కుటుంబాల వారితో ఉల్లాసంగా గడిపారు.

తీరం.. జన సంద్రం

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలో గల అక్కుపల్లి శివసాగర్ తీరం, మెట్టూరు, తోటూరు బీచ్‌లు సోమవారం కళకళలాడాయి. పలు ప్రాంతాల నుంచి సందర్శకులు వచ్చి బీచ్‌లతో సేద తీరారు. తీరంలో పలు రకాలు క్రీడలు ఆడుతూ సముద్ర స్నానాలు చేసి ఆనందంగా గడిపారు.

నంది వాహనంపై నాగాభరణుడు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో వెలిసిన మధుకేశ్వరుడిని సోమవారం కనుమ సందర్భంగా నంది వాహనంపై ఊరేగించారు. ముందుగా గణపతి పూజతో ప్రారంభించి స్వామికి ఏకవార అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం పార్వతీ పరమేశ్వరులను అలంకరించి నంది వాహనంపై తిరువీధి నిర్వహించారు. నగిరికటకం వరకు తిరువీధి జరిగింది. భక్తులు పెద్ద ఎత్తున హారతులిచ్చారు.



నంది వాహనంపై స్వామికి తిరువీధి ఉత్సవం నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

అడ్డదిడ్డంగా వాహనాల పార్కింగ్



టెక్కలి నుంచి కోటబొమ్మాళి వైపు వెళ్లే మార్గంలో కన్నేవలస వద్ద నిబంధనలకు విరుద్ధంగా జాతీయ రహదారిపై పార్కింగ్ చేసిన వాహనాలు

టెక్కలి: జాతీయ రహదారిపై నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను పార్కింగ్ చేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఓ వైపు ప్రమాదాల నివారణ కోసం జాతీయ రహదారిపై ప్రత్యేకంగా పోలీస్ వాహనాలు నిఘా వేస్తున్నాయి. మరో వైపు నిబంధనలకు విరుద్ధంగా అదే జాతీయ రహదారిపై వాహనాలు పార్కింగ్ చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. టెక్కలి నుంచి కోటబొమ్మాళి వైపు వెళ్లే మార్గంలో జాతీయ రహదారికి పక్కనే అనేక వాహనాలు పార్కింగ్ చేయడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వాస్తవంగా జాతీయ రహదారికి పక్కన వాహనాలను పార్కింగ్ చేయకూడదు. కానీ ఇక్కడ మాత్రం నిబంధనలు పాటించడం లేదు. దీనిపై పోలీసులు స్పందించి చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

కొత్త బెల్లం రెడీ

- బెల్లం తయారీలో రైతులు బిజీ
- నాగావళి తీర ప్రాంతాల్లో బెల్లం తయారీ

ఆమదాలవలస రూరల్: నాగావళి నదీ తీరంలో కొత్త బెల్లం సిద్ధమవుతోంది. ఇక్కడ వరికి పెట్టుబడులు పెరిగి దిగుబడులు తగ్గుతూ ఉండడంతో 12 ఏళ్లుగా చెరుకునే పండిస్తున్నారు. తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు వస్తుండటంతో చెరుకు పంటపై రైతులు మక్కువ చూపారు. మండలంలో చెరుకు పంట విస్తీర్ణం ఎక్కడా లేకపోయినా కొత్తవలస, పాతురు, నిమ్మతొర్లాడ, చేపానపేట, నెల్లిపర్తి, సిరిసిపేట, గరిమెళ్లకొత్తవలస గ్రామాల్లో సుమారు 300 హెక్టార్లలో రైతులు చెరుకు సాగు చేస్తున్నారు. ఈ గ్రామాల్లో చెరుకు పంట పండించే రైతులు సొంతంగానే బెల్లం కూడా తయారు చేస్తారు. ప్రతి రైతు కూడా తన సొంత పొలంలోనే గానుగ వేస్తూ బెల్లం తయారు చేసుకుంటూ రాష్ట్రస్థాయిలో గుర్తింపు తీసుకువచ్చారు. శాస్త్రవేత్తల సలహాలు పాటిస్తూ స్వల్పకాలిక చెరుకు విత్తనాలు వేసుకుంటూ బెల్లం తయారు చేసుకుంటున్నారు..

బెల్లం తయారీలో రైతులు బిజీ బిజీ

నాగావళి నదీ పరివాహక ప్రాంతాల్లో బెల్లం తయారు చేసే గ్రామాలుగా కొన్ని గ్రామాలు గుర్తింపు పొందాయి. ఈ గ్రామాల్లో నిత్యం రైతులు తమ పనుల్లో బిజీ బిజీగా కాలం గడుపుతుంటారు. చెరుకు పంటను సాగు చేసే రైతులు నేరుగా సొంతంగా బెల్లం తయారు చేసుకుని విక్రయిస్తారు. ప్రస్తుతం చెరుకు పంట చేతికందే దశలో ఉన్నందున గ్రామాల్లో బెల్లం తయారీ గానుగలు వెలిశాయి. రైతులే నేరుగా చెరుకు పంట చేసే పొలంలోనే గానుక ఏర్పాటు చేసుకుంటున్నారు. చెరుకు నరికే దశ నుంచి బెల్లం తయారీ చేసి, మార్కెట్‌లో అమ్మకాలు చేసేంత వరకు రైతులు బిజీగా కాలం గడుపుతారు. ప్రస్తుతం సంక్రాంతి పండగ దగ్గర పడుతుండటంతో బెల్లం కొనుగోలు కాస్త ఎక్కువగా జరుగుతున్నట్టు రైతులు చెబుతున్నారు.



అమ్మకానికి సిద్ధంగా ఉన్న బెల్లం చెక్కీలు



గానుగలో రసాన్ని బెల్లంగా తయారుచేస్తున్న రైతులు

బెల్లంతో ఆదాయ మార్గాలు

చెరుకు పంట సాగు చేసే రైతుకు ఎకరాకు 400 టన్నుల దిగుబడి వస్తుంది. దీని వల్ల బెల్లం దిగుబడి కాస్త పెరుగుతుందని రైతులు చెబుతున్నారు. చెరుకు పంట సాగుచేయడానికి వ్యయ భారం ఎక్కువగానే ఉన్నా రాబడి కూడా అలాగే ఉంటుంది. పొలంలోనే మోటార్లతో నీరు పెడుతూ విత్తనాలు, ఎరువులు, కూలి ఖర్చులు అన్నింటితో చెరుకు పంట పండించడానికి ఎకరానికి సుమారు రూ.40 వేలు వరకు ఖర్చవుతుంది. చెరుకు ద్వారా బెల్లం తయారు చేసి అమ్మకాలు సాగిస్తే రూ.95 వేలు వస్తుంది. పండించిన చెరుకు పంటను సకాలంలో నరకాలి. పక్వ కాలపరిమితికి ముందుగా గానీ లేదా ఆలస్యంగా గానీ నరికితే బెల్లం తయారీకి పనికి రాదు. నరికిన చెరుకు పంటను గానుగ వద్దకు చేర్చి చెరుగు గెడల నుంచి రసాన్ని తీస్తారు. గానుగ ఆడిన రసాన్ని పులిసిపోకుండా పెనంలో వేసి మంట పెట్టి మరగబెడతారు. మరగబెట్టిన రసాన్ని ఆరబెట్టి బెల్లం ముక్కలుగా తయారు చేస్తారు. తయారు చేసిన బెల్లం ముక్కలను కేజీ పద్ధతిలో గ్రామాల్లోకి రైతులు వెళ్లి నేరుగా విక్రయాలు చేస్తారు. ఎకరం చెరుకు పంటను బెల్లం తయారు చేస్తే 2.5 టన్నుల వస్తుంది. కిలో బెల్లం మార్కెట్‌లో రూ. 40 నుంచి రూ.45 వరకు ధరలు పలుకుతున్నాయి.

సంక్రాంతికి బెల్లం చెక్కీలు

సంక్రాంతి పండగకు గ్రామాల్లో విరివిరిగా కొత్త బెల్లాన్ని కొనుగోలు చేస్తుంటారు. పిండి వంటకాల తయారీ కోసం, గ్రామాల్లో ఆలయాలకు కొంత మంది భక్తులు నైవేద్యం కోసం కొత్త బెల్లాన్ని అందజేస్తారు. దీని వల్ల సంక్రాంతి సమయంలో కొత్త బెల్లానికి డిమాండ్ ఏర్పడుతుంది. రైతులు తయారు చేసిన బెల్లం చెక్కీలు కిలో మొదలుకొని 20 కిలోల బరువు ఉన్నవి తయారు చేస్తున్నారు. దీంతో కొత్త బెల్లం కోసం చెరకు రైతులంతా తయారీపై దృష్టిసారించారు. బెల్లం తయారు చేస్తున్న రైతులు గ్రామాల్లోకి వెళ్లి రైతులు విక్రయిస్తున్నారు.



చెరుకు రసంతో తయారైన బెల్లం పాకం